సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం, 22, సెప్టెంబర్, 2023



ఘాట్‌రోడ్డులో రక్షణ చర్యలు

ఏజెన్సీలోని ప్రధాన ఘాట్‌రోడ్లలో జంగిల్ క్లియరెన్స్ పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు పూర్తి చేశారు. 8లో



పసుపు..లాభాల ఛాయ

గత రెండేళ్లుగా నష్టాలు చవి చూసిన పసుపు రైతులు, వ్యాపారులు ఈ సంవత్సరం లాభాల బాట పట్టారు. 8లో



చట్టాలపై అవగాహన అవసరం

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రంపచోడవరం సీడీపీవో సంధ్యా రాణి సూచించారు. 8లో

న్యూస్‌రీల్

స్వల్పకాలిక కోర్సులను సద్వినియోగం చేసుకోండి

అరకులోయ రూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఉపాధి నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత స్వల్పకాలిక కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని స్కిల్ హబ్ కోఆర్డినేటర్ నాగేశ్వర్రావు, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు కోరారు. గురువారం వారు మాట్లాడుతూ గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి కల్పించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ప్రత్యేకమైన అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు అందుబాటులో ఉన్నాయన్నారు. 18 నుంచి 35 సంవత్సరాలు నిండి టెన్త్ లేదా ఆపై విద్యార్హత ఉన్న వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులన్నారు. అర్హత, ఆసక్తి గల వారు ఈనెల 26న సంబంధిత ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 8985832827 నంబరులో సంప్రదించాలని వారు సూచించారు.

వైఎస్సార్‌సీపీ న్యాయ విభాగ జోనల్ ఇన్‌చార్జిగా మహేశ్వర్‌రెడ్డి



గొరుసు మహేశ్వర్ రెడ్డి



మురళీ మోహన్‌రావు

దొండపర్తి (విశాఖ): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ న్యాయ విభాగ జోనల్ ఇన్‌చార్జితోపాటు, విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల న్యాయ విభాగ అధ్యక్షులను నియమించారు. న్యాయ విభాగ జోనల్ ఇన్‌చార్జిగా గొరుసు మహేశ్వర్ రెడ్డి, విశాఖ జిల్లా న్యాయ విభాగం అధ్యక్షుడిగా మేడిది ఆనంద్‌ప్రసాద్ నియమితుల య్యారు. అలాగే అనకాపల్లి జిల్లా న్యాయ విభాగ అధ్యక్షుడిగా అడారి వీర వెంకట సత్యనారాయణ (స్వామి), అల్లూరి సీతారామరాజు జిల్లా న్యాయ విభాగ అధ్యక్షుడిగా పి.మురళీమోహన్ నియమితులయ్యారు.

కొయ్యూరు జెడ్పీటీసీకి పరామర్శ



నూకరాజును పరామర్శిస్తున్న నేతలు

కొయ్యూరు: నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జెడ్పీటీసీ వారా నూకరాజును గురువారం పలువురు పరామర్శించారు. చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ, వైస్ ఎంపీపీ అంబటి నూకాలమ్మ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు, ఏఎంసీ డైరెక్టర్ అచ్యుత్, వైఎస్సార్‌సీపీ నేత రీముల గంగాధర్, సర్పంచ్‌లు శ్రీను, కోడా రాజు, జంపా రాజకుమారి, బాలకృష్ణ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు. జెడ్పీటీసీ వారా నూకరాజును వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీటీసీ మత్స్యరాస వెంకటలక్ష్మి పరామర్శించారు. వివాదానికి అవసరమైన కారణాలను తెలుసుకున్నారు. మాజీ ఎంపీపీలు గంగరాజు, రమణమూర్తి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన పండయ్య

అనంతగిరి: మండలంలోని చిలకలగెడ్డ చెక్‌పోస్ట్ సమీపంలోని గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా, మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం ప్రాంతానికి చెందిన టోనీ, స్నేహితుడితో కలిసి బైక్‌పై అరకు అందాలను తిలకించేందుకు వచ్చారు. వారు తిరిగి విశాఖపట్నం వెళ్తుండగా మండలంలోని చిలకలగెడ్డ చెక్‌పోస్ట్ సమీపంలో ఎదురుగా వస్తున్న దిగువబూడి గ్రామానికి చెందిన జి.పండయ్య బైక్‌ను ఢీకొన్నారు ఈ ప్రమాదంలో పండయ్య, టోనీ కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. మరో వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను ప్రైవేటు వాహనంలో ఎస్‌కోట తరలించారు.

జిల్లా ఆస్పత్రికి మహర్దశ

- వైద్య విధాన పరిషత్ నుంచి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోకి మార్పు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- అందుబాటులోకి రానున్న 330 పడకలు
- వైద్య కళాశాలకు ప్రిన్సిపాల్ నియామకం
- విధుల్లో చేరిన ఐదుగురు ప్రొఫెసర్లు
- గిరిజనులకు వరంలా సంస్కరణలు



సాక్షి,పాడేరు: స్వాతంత్య్రం సిద్ధించిన నాటి నుంచి వ్యాధి నిర్ధారణ, ఉన్నత వైద్యానికి నోచుకోని గిరిజనులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు వరంలా మారాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల పక్షపాతిగా సత్వర ఉన్నత వైద్యసేవలకు చర్యలు చేపట్టారు.రూ.500 కోట్లతో పాడేరులో వైద్య కళాశాల మంజూరు చేశారు. భవన నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభం కానుండటంతో పాడేరులోని జిల్లా ఆస్పత్రిని ముందస్తుగానే బోధన ఆస్పత్రికిగా అభివృద్ధి చేస్తోంది. ఏపీ వైద్యవిధాన పరిషత్ పరిధిలో ఉన్న ఆస్పత్రిని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)లోకి విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం 200 పడకలు ఉన్న ఈ ఆస్పత్రిలో మరో 130 పడకలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకు సంబంధించి జిల్లా ఆస్పత్రి భవనంలో అదనంగా మరో అంతస్తు నిర్మిస్తున్నారు. మొత్తం 330 పడకలతో జిల్లా ఆస్పత్రి బోధన ఆస్పత్రిగా మారనుండటంతో ఉన్నత వైద్యసేవలు చేరువకానున్నాయి.

ప్రిన్సిపల్‌తో పాటు ప్రొఫెసర్ల నియామకాలు

పాడేరు జిల్లా ఆస్పత్రి బోధన ఆస్పత్రిగా డీఎంఈ పరిధిలోకి రావడంతో అందుకు అవసరమైన ఫ్యాకల్టీ నియామకాలను ప్రభుత్వం వేగవంతం చేసింది. పాడేరు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ డి.హేమలత, పాడేరు జిల్లా బోధన ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ధర్మారావులను నియమించింది. అలాగే అసోసియేట్ ప్రొఫెసర్లుగా డాక్టర్ టి.విజయకుమారి(ఆర్థో), డాక్టర్ టి.ఎస్.ఎన్.రాజు(సైక్రియాటిక్), డాక్టర్ పండరీబాబు(మత్తు), డాక్టర్ పి.ఎర్రయ్య(ఎస్‌పీఎవ),అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్ (జనరల్ సర్జన్)లను నియమించింది. ఈ మేరకు వారు విధుల్లోకి చేరారు.అసోసియేట్ ప్రొఫెసర్లు,అసిస్టెంట్ ప్రొఫెసర్లు,పీజీ వైద్యులు,ఎంబీబీఎస్ వైద్యులు,ఇతర విభాగాల సిబ్బంది మొత్తం 100 వరకు పోస్టులను భర్తీ కానున్నాయి. జిల్లా ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలతో కూడిన ఆపరేషన్ థియేటర్‌ను రెండేళ్ల క్రితమే ఏర్పాటైంది.

జిల్లా ఆస్పత్రి వైద్యులకు బదిలీలు

ఏపీ వైద్యవిధాన పరిషత్‌లో ఇంతవరకు పనిచేసిన పాడేరు జిల్లా ఆస్పత్రి డీఎంఈలోకి విలీనం కావడంతో ఇక్కడ వైద్యనిపుణులు, వైద్యులను పలు ప్రాంతాల్లోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులకు బదిలీ అయ్యారు. వీరంతా కొద్దిరోజుల పాటు జిల్లా బోధన ఆస్పత్రిలో పనిచేస్తారు. అసోసియేట్ ప్రొఫెసర్ల,అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీ వైద్యులు పాడేరు బోధన ఆస్పత్రి విధుల్లో చేరగానే వారంతా వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రులకు వెళ్తారు.

అందుబాటులోకి ఉన్నత వైద్యం



పాడేరు జిల్లా ఆస్పత్రిని బోధన ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసి మెడికల్ కళాశాలకు అనుబంధంగా అభివృద్ధి చేయడం గిరిజనుల ఉన్నత వైద్యానికి శుభ పరిణామం.కేజీహెచ్‌కు రిఫరల్ కేసులు ఉండవు.అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లు, పీజీ వైద్యుల పర్యవేక్షణలో సకాలంలో అన్ని విభాగాల ఉన్నత వైద్యం అందుతుంది. పాడేరు జిల్లా ఆస్పత్రిలో పూర్తిగా ఉన్నత వైద్యసేవలు అందుబాటులోకి వస్తుండడం గిరిజన వైద్యుడిగా గర్వపడుతున్నా. గిరిజనులమంతా ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

– డాక్టర్ కె.కృష్ణారావు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, పాడేరు బోధన ఆస్పత్రి

నేడు, రేపు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటన

ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంత నాయక్ రెండు రోజులు జిల్లాలో పర్యటిస్తారని ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి 12 గంటలకు పాడేరు చేరుకుంటారన్నారు. పట్టణంలోని శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శిస్తారన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన జీసీసీ, వీడీవీకే స్టాళ్లను సందర్శిస్తారని ఆయన వివరించారు. గిరిజన రైతులకు అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేస్తారని తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు స్థానిక గిరిజన నేతలతో సమావేశం అనంతరం మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలిస్తారని ఆయన వివరించారు. కుమ్మరిపుట్టులో గిరిజన గురుకుల పాఠశాల, ఏకలవ్య పాఠశాలను సందర్శిస్తారన్నారు. మధ్యాహ్నం 3.45 గంటలకు కలెక్టరేట్‌లో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. రాత్రికి పీఎంఆర్సీ భవనంలో బస చేస్తారు. 23న ఉదయం హుకుంపేట మండలం మఠం గ్రామానికి చేరుకొని వనవాసి కళ్యాణ్ ఆశ్రమంలో అల్పాహారం చేస్తారు.

అనంతరం తొమ్మిది గంటలకు ఉప్ప గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, గుత్తులపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను సందర్శిస్తారని వివరించారు. అనంతరం డుంబ్రిగుడలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలిస్తారని చెప్పారు. అనంతరం 11.30 గంటలకు కిల్లోగుడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, 11.45 గంటలకు పద్మాపురం గార్డెన్, 12.20 గంటలకు గిరిజన మ్యూజియం సందర్శిస్తామని పీవో పేర్కొన్నారు. మధ్యాహ్నం భోజన అనంతరం విశాఖపట్నం బయలుదేరి వెళ్తారని పీవో వెల్లడించారు.

హైవోల్టేజీ లైన్లలో లోపాల సవరణ



విద్యుత్ లైన్లను సరిచేస్తున్న హాట్‌లైన్ సిబ్బంది

సీలేరు: కరెంటు పేరు వింటేనే గుండె దడేల్ మంటుంది. కాస్త షాక్ తగిలితే ప్రాణాలు పోయే పరిస్థితి. అలాంటిది హై వోల్టేజీ విద్యుత్ లైన్లలో విద్యుత్ సరఫరా అవుతుండగా వాటిపైకి ఎక్కి మరమ్మతులు చేపట్టడం ఎంత ప్రమాదకరమో తెలిసిందే. గురువారం సీలేరు జల విద్యుత్ టవర్ లైన్లకు సరఫరా ఉండగా వాటిపైకి హాట్‌లైన్ సిబ్బంది ఎక్కి మరమ్మతులు చేపట్టారు. ఏపీ జెన్‌కో సీలేరు విద్యుత్ కాంప్లెక్స్ మాచ్‌ఖండ్, సీలేరు, డొంకరాయి, మోతుగూడెం విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అయ్యే విద్యుత్ 220 కేవీ విద్యుత్ లైన్ల ద్వారా వివిధ ప్రాంతాలకు సరఫరా అవుతుంది. ఈ క్రమంలో విద్యుత్ లైన్లు సక్రమంగా ఉన్నాయా.. లేదా అనే విషయాన్ని హాట్‌లైన్ సిబ్బంది పరిశీలించారు. ప్రత్యేక దుస్తులు ధరించి థర్మో విజన్ కెమెరా పరికరం ద్వారా ఈ విద్యుత్ లైన్లను తనిఖీ చేశారు. హైవోల్టేజీ ఉన్న లైన్లను సరిచేశారు. ఈ క్రమంలో సీలేరు జల విద్యుత్ కేంద్రం నుంచి గాజువాక, బొంగూరు సబ్‌స్టేషన్లకు వెళ్లే 220 కేవీ విద్యుత్ లైన్, సీలేరు–డొంకరాయి, డొంకరాయి–సీలేరు 33 కేవీ విద్యుత్ లైన్లలో లోపాలను సరిచేశారు. హాట్‌లైన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీవీ రమణ, ఏఈ శ్రీనివాసరావు, జేఈ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఓఅండ్‌ఎమ్‌కు చెందిన ఆరుగురు బృందం సభ్యులు లోపాలను సరిదిద్దాయి.

నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ హెచ్చరిక



లబ్బూరు ఏకలవ్య మోడల్ పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

ముంచంగిపుట్టు: భవన నిర్మాణాల్లో నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ హెచ్చరించారు. మండలంలోని జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు గ్రామ సమీపంలో నిర్మిస్తున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను గురువారం ఆయన తనిఖీ చేశారు. డిసెంబర్ నెలాఖరుకు పనులు పూర్తిచేసి అప్పగించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.అనంతరం రావిడిపుట్టు గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడారు. నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. అనంతరం బంగారుమెట్టలో సచివాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. చురుగ్గా జరగకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కిలగాడ పంచాయతీ రాయిపల్లి అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కె.వేణుగోపాల్, ఏఈఈ జబ్బర్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ఇన్‌చార్జి డీఈవో గౌరీ శంకర్



బాలికల-1 పాఠశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఈవో గౌరీశంకర్

అనంతగిరి: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని ఇన్‌చార్జి డీఈవో గౌరీశంకర్ సూచించారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలికల-1 పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. అసెంబ్లీ సమయంలో విద్యార్థినులతో మాట్లాడారు.. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, బాగా చదువుకోవాలని సూచించారు. బోధన అర్థం కానప్పుడు తప్పనిసరిగా ఉపాధ్యాయులను మళ్లీ అడిగి తెలుసుకోవాలన్నారు. పోటీగా చదవాలని, చదువుతోనే ఉన్నతస్థాయికి చేరవచ్చునని, ఆదిశగా విద్యార్థినిలు అడుగులు వేయాలన్నారు. అనంతరం వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నగేష్, పడాల్ పాల్గొన్నారు.

పిడుగుపాటుతో గిరిజనుడికి అస్వస్థత



పిడుగుపాటుకు అస్వస్థతకు గురైన గిరిజనుడు దూరు గంగన్నదొర

అనంతగిరి: మండలంలోని మారుమూల గుమ్మకు చెందిన చెందిన దూరు గంగన్నదొర పిడుగుపాటుకు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గురువారం గ్రామ సమీపంలోని మధ్యాహ్నం పశువులను మేపుతుండగా ఉరుములు మెరుపులతో భారీ వర్షంతో కురిసింది. ఇదే ప్రాంతానికి సమీపంలో పిడుగుపడడంతో ఐదు పశువులు మృతి చెందాయి. అక్కడే ఉన్న గంగన్నదొర అపస్మారస్థితికి చేరుకున్నాడు.ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే వాహనంలో ఎస్‌కోట ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యసేవల నిమిత్తం కేజీహెచ్‌కు తరలించినట్లుగా కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని ఆందోళన

ప్లకార్డులతో గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన



ఎస్‌ఐకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన సంఘ నేతలు



అదనపు ఎస్పీ అనిల్ పులిపాటికి వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు లిల్లీ

పెదబయలు: మండలంలోని లక్ష్మీపేట పంచాయతీ మొండికోట గ్రామానికి చెందిన కించేయి విజయ్‌కుమార్‌పై దాడికి పాల్పడిన ఎస్‌ఐ పులి మనోజ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘ నేతల ఆధ్వర్యంలో మొండికోట గ్రామస్తులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో జెడ్పీ పాఠశాల మైదానం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఐకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలీసులు ప్రజలతో స్నేహ భావంతో మెలగాలని ప్రభుత్వం, ఉన్నతాధికారులు పదేపదే చెబుతున్నా ఎస్‌ఐ మనోజ్‌కుమార్ అందుకు భిన్నంగా వ్యవహరించారని ఆరోపించారు. అతనిపై అట్రాసిటీ కేసు నమోదు చేయడంతోపాటు వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధితుడు కించేయి విజయ్‌కుమార్, గిరిజన సంఘం జిల్లా ప్రతినిధులు బొండా సన్నిబాబు, మండల నాయకులు గంగాధరం, కిల్లో శరభన్న, మర్రిచెట్టు పోతురాజు, లక్ష్మీపేట వైస్ సర్పంచ్ ఎం.అప్పలనాయుడు, బత్తిరి రామారావు, ఏబీవీపీ నాయకులు అంగనైని ఆనంద్, అల్లంగి మహేష్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

పాడేరు రూరల్ : సెల్ టవర్ నిర్మాణం కోసం స్థలం ఇవ్వలేదనే సాకుతో కులం పేరుతో దూషించి గిరిజనుడిపై దాడికి పాల్పడిన పెదబయలు ఎస్‌ఐ మనోజ్‌కుమార్‌తో పాటు జియో టవర్ నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్‌పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు జంపరంగి లిల్లీ కోరారు. ఈ మేరకు గురువారం పాడేరులో అదనపు ఎస్పీ అనిల్ పులిపాటిని కలిసి వినతిపత్రం అందజేశారు. పెదబయలు మండలం లక్ష్మీపేట పంచాయతీలో జియో సెల్ టవర్ నిర్మాణానికి స్థలం ఇవ్వలేదనే కారణంతో కించే విజయ్‌కుమార్ అనే గిరిజన యువకుడిని పెదబయలు ఎస్‌ఐ, జియో టవర్ కాంట్రాక్టర్ కులం పేరుతో దూషించి భౌతిక దాడికి పాల్పడి గాయపరిచారన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌తో పాటు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం జిల్లా కన్వీనర్ తెదబారికి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

చింతపల్లి: చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా నిలిచిపోతుందని ఆయన పేర్కొన్నారు.

కిశోర బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

రాజవొమ్మంగి: మండలంలోని అమీనాబాద్‌కాలనీకు చెందిన కిశోర బాలిక గోకూరి దుర్గాభవాని (16) అదృశ్యంపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని జడ్డంగి ఎస్‌ఐ రఘునాథరావు తెలిపారు. దుర్గాభవానీ అమ్మమ్మ మాడెం లక్ష్మి వద్ద ఉంటోంది. ఈ నెల 19వ తేదీ వేకువజాము నుంచి కనిపించడం లేదని ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

నిర్లక్ష్యం చేస్తే జీతాలు నిలిపివేత

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: చింతూరు డివిజన్‌లో ఉపాధి హామీ పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బంది జీతాలు నిలిపివేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో గురువారం రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని 11 మండలాలకు సంబంధించిన ఉపాధి హామీ పథకం ఏపీడీ, ఏపీవోలతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి పనులపై సమీక్షించారు. చింతూరు డివిజన్‌లో లక్ష్యం మేర జరగకపోవడాన్ని ఆయన గుర్తించి చర్యలకు ఆదేశించారు. పంచాయతీల పరిధిలో గ్రామాల వివరాలు, కల్పించిన పనులు, జాబ్ కార్డుల వివరాలను ఆయన తెలుసుకున్నారు. ఏజెన్సీలో ప్రతి కుటుంబానికి ఉపాధి పథకం ద్వారా పనులు కల్పించాలన్నారు. ఏపీవోలు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో ఉపాధి పనులను పర్యవేక్షించాలని సూచించారు. గంగవరం మండలంలోని ముకాస భూములకు సంబంధించిన వివరాలు అందజేయాలని ఏపీవోను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ఏపీడీలు రాంబాబు, భాగ్యారావు, ఉపేంద్ర, ఏపీవోలు సాయిబాబా, ప్రకాష్, సురేష్, రెడ్డి బాబు పాల్గొన్నారు.

దాడులతో సమస్యలు మరింత జటిలం

భూ వివాదంపై తహసీల్దార్ వరహాలు, ఎస్సై నాగకార్తీక్ హెచ్చరిక



చటర్జీపురం రైతులతో చర్చిస్తున్న తహసీల్దార్ వరహాలు, ఎస్సై నాగకార్తీక్

రోలుగుంట: సమస్య పరిష్కారానికి దాడులు, పంటల ధ్వంసం సరికాదని, సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ కె.వరహాలు, ఎస్‌ఐ బి.నాగకార్తీక్ హితవు పలికారు. బుధవారం రోలుగుంట మండలం ఎం.కె.పట్నం రెవెన్యూ చటర్జీపురంలో అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు జెడ్పీటీసీ వారా నూకరాజు, అతని అనుచరులకు, స్థానిక భూసాగుదారులకు మధ్య ఘర్షణ తలెత్తిన విషయం విదితమే. ఈ మేరకు సాగుదారులు కేదారి రాజబాబు, నీలాపు ఎరకన్న, ఈదెల రాజేశ్వరి, నీలాపు అప్పలనాయుడు తదితరులు రోలుగుంట తహసీల్దార్ కార్యాలయంలో నర్సీపట్నం ఆర్డీవో జయరాంకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయాలని తహసీల్దార్‌ను ఆయన ఆదేశించారు. ఈ మేరకు గ్రామానికి వెళ్లి భూవివాదంలో ధ్వంసమైన అరటి, జామతోటలను తహసీల్దార్ గురువారం పరిశీలించారు. అనంతరం సాగుదారులను విచారించారు.

భూవివాదానికి కారణమైన వారితో గ్రామ పెద్దల సమక్షంలో చర్చించుకుంటే సామరస్యంగా సమస్య పరిష్కారమవుతుందని సూచించారు. విచారణ నివేదిక నర్సీపట్నం ఆర్డీవోకు అందజేయనున్నట్టు తెలిపారు. ఎస్‌ఐ బి.నాగకార్తీక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏవోబీలో ముమ్మర తనిఖీలు



పోలిపుట్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ రవీంద్ర, సిబ్బంది



నెల్లిపాకలో జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు

ముంచంగిపుట్టు: మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో గురువారం ఎస్‌ఐ రవీంద్ర ఆధ్వర్యంలో ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టు, పోలిపుట్టు జంక్షన్‌లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మారుమూల రంగబయలు. బుంగాపుట్టు పంచాయతీలతో పాటు ఒడిశా రాష్ట్రం నుంచి వచ్చే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రయాణికుల లగేజీలు,బ్యాగ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు.అనుమానితుల వివరాలు సేకరించి విడిచిపెట్టారు.ప్రభుత్వ కార్యాలయాల వద్ద రాత్రిపూట పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు.

ఎటపాక: సీపీఐ మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా ఎస్‌ఐ పార్థసారథి ఆధ్వర్యంలో గురువారం స్థానిక జాతీయ రహదారి సెంటర్లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. చత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సేకరించారు. రాత్రి వేళల్లో నెల్లి పాక నుంచి చింతూరు వరకు వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నారు. వాహనాలను చట్టి నుంచి కూనవరం మీదుగా భద్రాచలం పంపిస్తున్నారు.

డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ



డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్న అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్

చింతపల్లి రూరల్: మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా భద్రత బలగాలను కట్టుదిట్టం చేశామని చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్ తెలిపారు. గురువారం ఆయన రాళ్లగడ్డ ఆర్మ్‌డ్ అవుట్‌పోస్టును సందర్శించారు. డ్రోన్ కెమెరాలతో బలపం పంచాయితీకి చెందిన కోరుకొండ, కుడుములు, బలపం పరిసరాల్లో పరిస్థితిని పర్యవేక్షించారు. సీఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాగునీటి సమస్యకు త్వరితగతిన పరిష్కారం


మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రకాష్

జి.మాడుగుల: మండలంలో జల్ జీవన్‌మిషన్, జీజీఎంపీ పనులు వేగవంతం చేసి మంచినీటి సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇంజినీర్లు దృష్టి సారించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రకాష్, ఎంపీడీవో చంద్రశేఖరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జల్‌జీవన్ మిషన్ పథకం పనుల ప్రగతిపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. మండలంలో గ్రామాల్లో జేజేఎం పనుల స్థితిగతులు, టెండర్ కావల్సిన పనులపై వారు చర్చించారు. వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్, పీఆర్ ఏఈ మాణిక్యం, ఎంపీటీసీలు మత్స్యరాస విజయకుమారి, చిన్నారావు, చిట్టిబాబు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ, సర్పంచ్‌లు రాంబాబు, మాలన్న, గంగరాజు, మత్స్యంనాయుడు, పెదబాలన్న, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు


పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న వెటర్నరీ అధికారి అప్పనబాబు

గంగవరం: మండలంలోని బి.శివరామపటం గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వెటర్నరీ అధికారి ఆధ్వర్యంలో శిబిరంలో 182 తెల్లజాతి పశువులకు జబ్బవాపు వ్యాధి నిర్మూలన టీకాలు, 12 గేదెలకు గర్భకోశ వ్యాధి టీకాలు, 200 మేకలకు , గొర్రెలకు నట్టల వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పశు సంపదను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మన ఊరు–మన పశు సంపద కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశు వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మందులు పంపిణీ చేశారు. మొల్లేరు పశు వైద్యశాల సిబ్బంది అనంతలక్ష్మి , సాంబమూర్తి, నవ్య, తరుణ్, క్రాంతి, చిన్నబాబు, తదితరులు పాల్గొన్నారు. జడేరు, కుసుమరాయి గ్రామాల్లో పశువైద్య సహాయకులు పశువులకు టీకాలు వేశారు.

ముత్యమంత పసుపు.. లాభాల ఛాయ

పసుపు మార్కెట్‌కు కేంద్రమైన మాడుగుల ఈ ఏడాది లాభాలతో మినమినలాడుతోంది. సాగు పెంచిన రైతులు ఎక్కువ దిగుబడి సాధించారు. మంచి ధర కూడా పలకడంతో వ్యాపారులు ఖుషీగా ఉన్నారు. దేశీయ మార్కెట్‌లో మన మన్యం పసుపునకు మంచి డిమాండ్ ఉండడంతో మాడుగుల ప్రాసెసింగ్ కేంద్రాలు కళకళలాడుతున్నాయి.

- ఈ ఏడాది సేకరణ ధర పెరగడంతో ఏజెన్సీ రైతుల్లో ఆనందం
- గంజాయికి ప్రత్యామ్నాయంగా విరివిగా పసుపు సాగు
- అంతర్జాతీయ మార్కెట్‌లో గిరాకీతో వ్యాపారులకు లాభాలు


పసుపు ప్రాసెసింగ్ అనంతరం ఎగుమతి చేయడానికి సంచుల్లో నింపుతున్న దృశ్యం


పసుపును గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

మాడుగుల: గత రెండేళ్లుగా నష్టాలు చవి చూసిన పసుపు రైతులు, వ్యాపారులు ఈ సంవత్సరం లాభాల బాట పట్టారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మన్యం ముఖద్వారమైన మాడుగుల పసుపు వ్యాపారానికి ప్రధాన కేంద్రంగా ఉన్న విషయం తెలిసిందే. ఏజెన్సీ 11 మండలాల్లో పండించిన పసుపును ఇక్కడికే తీసుకువస్తారు. వ్యాపారులు కొనుగోలు చేసి ఇక్కడున్న ప్రాసెసింగ్ కేంద్రాల్లో వాటిని శుద్ధి చేసి వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీలో గంజాయి సాగును కట్టడి చేయడంతో ప్రత్యామ్నాయం వైపు చూసిన రైతులు ఈ ఏడాది పసుపు సాగు విస్తీర్ణాన్ని పెంచారు. దాంతో దిగుబడి కూడా పెరిగింది. దానికి తోడు మంచి ధర కూడా పలకడంతో పసుపు రైతులు, వ్యాపారులకు ఈసారి లాభాల పంట పండింది. ప్రస్తుతం ఏజెన్సీలో 4 వేల ఎకరాల్లో పసుపు పండిస్తున్నారు. రెండేళ్ల కిందటి వరకు ఏజెన్సీ 11 మండలాల నుంచి 80 కిలోల పసుపు బస్తాలు 70 వేల నుంచి 80 వేల వరకు మాడుగుల వచ్చేవి. గత ఏడాది లక్ష, ఈ ఏడాది లక్షా 20 వేల బస్తాల వరకు వచ్చినట్టు వ్యాపారులు తెలిపారు. పసుపుపై 5 శాతం జీఎస్టీ విధిస్తున్నారని, మినహాయింపు ఇచ్చి ప్రోత్సహించాలని వారు కోరుతున్నారు.

మాడుగుల పసుపు పరిశ్రమకు ఇతర రాష్ట్రాల్లో గుర్తింపు

దక్షిణ భారతంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని నర్సీపట్నం, పాలకొండ, రాజమండ్రి, వరంగల్, నిజామాబాద్, దుగ్గిరాలతోపాటు తమిళనాడు, కేరళ, ఒడిశాలోని బరంపురంలో పసుపు పరిశ్రమలున్నాయి. మాడుగులతోపాటు తుని, నర్సీపట్నం, సాలూరుల్లో ప్రాసెసింగ్ కేంద్రాలున్నాయి. కానీ మాడుగుల పసుపునకు మాత్రమే దేశీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. విశాఖ మన్యంలో పండించే పసుపులో ఔషధ గుణాలున్న కుర్కుమిన్‌తోపాటు చర్మ సౌందర్యానికి ఉపయోగపడే ఓలంటయిల్ ఉండడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. రసాయనిక ఎరువులు వాడకుండా పూర్తిగా ఆవు పేడ నుంచి తయారుచేసే ఎరువుతో పండించే ఆర్గానిక్ పంట కావడంతో మాడుగుల పసుపునకు మంచి మార్కెట్ ఉంది. మిగతా ప్రాంతాల్లో పండించే పసుపులో కుర్కుమిన్ 1.5 నుంచి 2 శాతం ఉంటే.. మాడుగుల పసుపులో 5 నుంచి 6 శాతం ఉండడంతోపాటు రంగు ఆరెంజ్ ఎల్లో కావడంతో మంచి క్రేజ్ ఉంది. నాణ్యమైన పసుపు కావడంతో సౌందర్యసాధనంగానే కాక వంటకాల్లో వాడేందుకు కూడా దీనిని వినియోగిస్తారు.

1400 కుటుంబాలకు జీవనోపాధి

మాడుగులలో 6 ప్రాసెసింగ్ కేంద్రాలున్నాయి. పసుపు ఈ ప్రాంతంలో 1400 కుటుంబాలకు జీవనాధారం. 200మంది చిన్నా పెద్ద వ్యాపారులు ఇక్కడకు వచ్చి కొనుగోలు చేస్తారు. సీజన్‌లో సుమారు 300 లారీల్లో సరకు పంపిస్తారు. ఇక్కడ పసుపును ఉడికించి డ్రమ్ములలో వేసి మంచి ఛాయ పసుపుగా తయారు చేసి ఆకర్షణీయమైన ప్యాకెట్‌లలో ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ప్రతి ఏటా సుమారు రూ.500 కోట్లలో వ్యాపారం జరుగుతుంది.

మాడుగుల పసుపులో కుర్కుమిన్ అధికం



కుర్కుమిన్ అధికంగా ఉండే పసుపును తమిళనాడులో ఎక్కువగా ఇష్టపడతారు. వంటకాల్లో వినియోగిస్తారు. ఔషధాల తయారీలో వాడతారు. దీంతో మన ప్రాంత పసుపునకు అంతర్జాతీయ మార్కెట్‌లో ఎక్కువ గిరాకీ ఉంది. గతంలో కిలో పసుపు ధర రూ.70 నుంచి రూ.80 పలికేది. ప్రస్తుతం కిలోకు రూ.95 నుంచి రూ.100 వరకు వస్తోంది.

–దేవరాపల్లి శ్రీనివాసరావు, పసుపు వ్యాపారి, మాడుగుల

పసుపు కేంద్రాలే జీవనాధారం

తరతరాలుగా పసుపు ప్రాసెసింగ్ కేంద్రాలే మాకు జీవనాధారం. ఏజెన్సీలో పండించే దశ నుంచి మాడుగులలో ప్రాసెసింగ్ జరిగే వరకు మాకు పని ఉంటుంది. పసుపులో ఔషధ గుణాలు ఉండడంతో కరోనా మా దరి చేరలేదు.

–కోడూరు అప్పారావు, పసుపు కార్మికుడు, మాడుగుల

జీఎస్టీ తొలగించాలి

మాకు పసుపు పంటలే జీవనాధారం. సేకరణ ధర పెరగడంతో ఏజెన్సీలో రైతులందరూ పసుపు సాగుపై దృష్టి సారించారు. పసుపు పంటపై ఉన్న 5 శాతం జీఎస్టీ తగ్గిస్తే మాలాంటి వారికి ఎంతో మేలు జరుగుతుంది.

–కె.చైత్రసాయి, పసుపు రైతు, పెదబయలు

నేడు పెదబయలులో స్పందన రద్దు

సాక్షి,పాడేరు: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంతనాయక్ పర్యటన నేపథ్యంలో పెదబయలులో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని శుక్రవారం రద్దు చేసినట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.అలాగే పాడేరు ఐటీడీఏలోను శుక్రవారం స్పందన కార్యక్రమం నిర్వహించడం లేనట్టు పేర్కొన్నారు. జిల్లాలోని అర్జిదారులంతా స్పందన రద్దు విషయాన్ని తెలుసుకుని పెదబయలు మండల పరిషత్, పాడేరు ఐటీడీఏలకు రావొద్దని కలెక్టర్ సూచించారు.

చట్టాలపై అవగాహన అవసరం

రంపచోడవరం: మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రంపచోడవరం సీడీపీవో సంధ్యారాణి అన్నారు. దేవీపట్నం మండలం ఇందుకూరుపేట సమీపంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో గురువారం ప్రకృతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎస్ఎల్‌సీడబ్ల్యూ సహకారంతో నిర్వహించిన లీగల్ అవేర్‌నెస్, లీడర్ షిప్ టు ఎస్‌హెచ్‌జీ (స్వయం సహాయక సంఘాలు) ఉమెన్స్‌కు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగవాడీ కేంద్రాల్లో కేవలం పోషకాహార కేంద్రాల అందించే సెంటర్లు మాత్రమే కాదని న్యాయపరమైన సహాయం కూడా అందుతాయన్నారు. మహిళల రక్షణ కోసం దిశా చట్టం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు .రంపచోడవరం న్యాయవాది ఎ.వి.సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలకు గృహ హింస చట్టం ద్వారా న్యాయం జరుగుతుందన్నారు. మండల లీగల్ సర్వీసెస్ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు. మహిళలు నాయకత్వ లక్షణాలను పెంచుకొని సమస్యలపై చైతన్యంతో ముందుకెళ్లాలన్నారు. పోలవరం ప్రాజెక్టు ఆర్‌అండ్‌ఆర్ సమస్యలపై మండలా లీగల్ సర్వీస్ ద్వారా న్యాయం పొందవచ్చన్నారు. ప్రకృతి స్వచ్ఛంధ సంస్థ డైరెక్టర్ జి.సుబ్బరాజు, కొమరం రాంబాబు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీలు

అడిషనల్ పీడీ గిరిబాబు


వివరాలు తెలుసుకుంటున్న అడిషనల్ పీడీ గిరిబాబు, వేదికపై ఎంపీపీ ఉషారాణి, జెడ్పీటీసీ రోహిణి

అరకులోయ రూరల్: ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులకు పారదర్శకంగా సామాజిక తనిఖీలు జరిగినట్టు ఉపాధి హామీ పథకం పీడీ గిరిబాబు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండలంలో 14 గ్రామ పంచాయతీల పరిధిలోని వివిధ గ్రామల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక గురువారం నిర్వహించారు.

ఈ సందర్భంగా అడిషనల్ పీడీ గిరిబాబు మాట్లాడుతు 2022–23 ఏడాదిలో మండల పరిధిలోని రూ.25.10కోట్లతో ఉపాధి హామీ పథకం పనులు జరిగాయన్నారు. పంచాయతీరాజ్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖలను ఉపాధి హామీ పథకం సంయుక్తంగా చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి మెటిరియల్ రూ.3.99కోట్లతో వివిధ రకాల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులకు అధికారులు నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఉపాధి హామీ పనులు, వివిధ అభివృద్ధి పనుల్లో పారదర్శకంగా సిబ్బంది పనిచేయలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఉషారాణి, జెడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో వలసలు లేకుండా విస్తృతంగా ఉపాధి పనులు చేపట్టాలని, కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించేలా అధికారులు చూడాలని కోరారు. వైస్ ఎంపీపీలు కిల్లో రామన్న, సుమాంజలి, ఎంపీడీవో నగేష్, ఎస్ఆర్పీ కనకారావు, ఏపీవో జగదీష్, ఈసీ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మరో వారం దంతేవాడ వరకే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: భద్రతా కారణాల వల్ల కొత్తవలస–కిరండూల్ లైన్‌లో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం–కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 28వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 29వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 28వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ రైలు ఈ నెల 22 నుంచి 29వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

ఘాట్‌రోడ్డులో రక్షణ చర్యలు

- జంగిల్ క్లియరెన్స్‌తో తుప్పల తొలగింపు
- పలుచోట్ల రక్షణ గోడల నిర్మాణాలు


ఘాట్‌రోడ్డులో జంగిల్‌క్లియరెన్స్ చేసిన దృశ్యం

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని ప్రధాన ఘాట్‌రోడ్లలో జంగిల్ క్లియరెన్స్ పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు పూర్తి చేశారు. పాడేరు, కొక్కిరాపల్లి, లంబసింగి ఘాట్ రోడ్లలో రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన తుప్పలు, డొంకలు తొలగించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఇటీవల కలెక్టర్ సుమిత్ కుమార్ ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆర్‌అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు ,ఇతర ఇంజనీరింగ్ అధికారులంతా ఘాట్ రోడ్లలో చేపట్టిన జంగిల్ క్లియరెన్స్ పనులను పర్యవేక్షించారు. పాడేరు నుంచి గరికిబంద చెక్‌పోస్టు, జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతం జంక్షన్ నుంచి కొక్కిరాపల్లి ఘాట్ ముగిసేవరకు, చింతపల్లి మండలంలోని లంబసింగి నుంచి డౌనురు వరకు ఘాట్ రోడ్డుకు ఇరువైపులా తుప్పలు, డొంకలు తొలగించడంతో వాహనాల రాకపోకలు సాఫీగా జరుగుతున్నాయి. ఎదురెదురు వాహనాలకు తుప్పల అడ్డంకి తొలగింది. అలాగే పాడేరు ఘాట్‌లోని పలు వాహన ప్రమాదాలతో కూలిపోయిన రెండు మలుపుల్లోని రక్షణ గోడలను పునర్నిర్మించారు. మొత్తం ఈ మూడు ఘాట్ ప్రాంతాలలో జంగిల్ క్లియరెన్స్ పనులు ,పాడేరు ఘాట్‌లో రెండు చోట్ల రక్షణ గోడల నిర్మాణాలకు రూ.5లక్షలు ఖర్చు చేసినట్టు ఆర్‌అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు 'సాక్షి'కి తెలిపారు.

జిల్లా పరిషత్ ఉద్యోగులకు పదోన్నతులు


పదోన్నతులు పొందిన ఉద్యోగులతో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట (విశాఖ): జిల్లా పరిషత్‌లో పనిచేస్తున్న నలుగురు జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. నియామక పత్రాలను గురువారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమకు కేటాయించిన కార్యాలయాల్లో ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వర్తించాలన్నారు. పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు మాట్లాడుతూ సిబ్బందికి పదోన్నతులు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తి, అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరు అదుపులోకి

కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు

మాకవరపాలెం: యువకుడి హత్య కేసులో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని దుంగలవానిపాలెం గ్రామానికి చెందిన ధనిమిరెడ్డి రవి(35) మంగళవారం రాత్రి రామన్నపాలెం గ్రామ సమీపంలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లోనూ దర్యాప్తు ముమ్మరం చేశారు. దీనిలో భాగంగా ఈ హత్యకు పాల్పడిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తొలుత వివాహేతర సంబంధంగా అనుమానం వ్యక్తం చేశారు. కానీ రవి హత్యకు ఇది కారణం కానట్టుగా పోలీసులు ఇప్పటికే ఒక నిర్ధారణకు వచ్చినట్టు సమాచారం. హత్యకు దారితీసిన కారణాలపై నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య, స్థానిక ఎస్ఐ రామకృష్ణారావు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు గునుపూడి విద్యార్థులు

నాతవరం: మండలంలోని గునుపూడి హైస్కూల్‌కి చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు టి.శివజ్యోతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారిని పాఠశాలలో అభినందించారు. ఈ నెల 20న బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడిలో జరిగిన జిల్లా స్థాయిలో పోటీల్లో అండర్–17 విభాగంలో ఎల్.అరవింద్, ఎ.నాగలక్ష్మీదేవి, అండర్–14 విభాగంలో జి.ప్రశాంతి, ఎం.భార్గవ్ ధనుష్ విజేతలుగా నిలిచినట్లు పేర్కొన్నారు. వీరు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు ఎల్.అప్పలనాయుడు తెలిపారు.

గంజాయితో ఒకరి అరెస్ట్, మరొకరు పరారీ

చీడికాడ: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్ఐ పి.రామారావు గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు గురువారం ఉదయం మండలంలోని అప్పలరాజుపురం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. పల్సర్ బైకుపై కోణాం నుంచి వస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పరారయ్యేందుకు ప్రయత్నించారు. బైకు జారిపోవడంతో బైకు వెనుక నున్న ఏఎస్సార్ జిల్లా, చింతపల్లికి చెందిన కొర్రా దాసురావు కిందపడి పోలీసులకు చిక్కాడు. బైక్ రైడ్ చేస్తున్న వ్యక్తి పరారయ్యాడు. దాసురావు వద్దనున్న కాలేజీ బ్యాగులో వెతగ్గా, 12 కిలోల గంజాయి ప్యాకెట్లను గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి, పరారైన వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

వైద్యులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ప్రకాశం

సాక్షి ఎఫెక్ట్..


పీహెచ్‌సీ వద్ద ఏడీఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాశం

రాజవొమ్మంగి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులు బాధ్యతాయుతంగా పని చేయాలని ఏడీఎంహెచ్‌ఓ డాక్టర్ జి.ప్రకాశం అన్నారు. ఈనెల 19న ×వైద్యులు లేక రోగుల ఇక్కట్లు× శీర్షికన ×సాక్షి×లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు.ఈ మేరకు ఐటీడీఏ పీఓ, డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు పీహెచ్‌సీని సందర్శించినట్టు డాక్టర్ ప్రకాశం విలేకరులకు తెలిపారు. పీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్లు లిఖిత, ఉషశ్రీ, లాగరాయి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ రవీంద్రలతో ఆయన సమావేశమై పలు సూచనలిచ్చారు. రోగుల వార్డు, బర్త్ వెయిటింగ్ రూంలను సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. 19వ తేదీన పాయిజన్ కేసు వచ్చిందని, పలు అత్యవసర కేసులు కూడా ఆసుపత్రికి వచ్చారని, ఆ సమయంలో ఇరువురు డాక్టర్లలో ఒకరు కూడా అందుబాటులో లేకపోవడం బాధ్యతారాహిత్యమేనన్నారు. వైద్యం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తుండగా క్షేత్ర స్థాయిలో రోగులకు కనీస వైద్యం అందకపోవడానికి కారణం ఏమిటని వైద్యులను ప్రశ్నించారు. ఆయన మాట్లాడుతూ రోగులకు అందుబాటులో ఉండి పూర్తిస్థాయిలో మెరుగైన వైద్యం అందించాలన్నారు. సాధ్యమైనంత వరకు స్థానిక ఆస్పత్రిలోనే చికిత్స అందజేయాలని, అత్యవసరం అయితేనే రోగిని పట్టణ ప్రాంతాలకు రిఫర్ చేయాలన్నారు. ఒకవేళ రోగిని ఇతర ప్రాంతానికి రిఫర్ చేస్తే ఆ రోగి ఆ ఆసుపత్రికి చేరుకున్నట్టు రిజిస్టర్ అయ్యే వరకు డ్యూటీలో ఉన్న డాక్టరే బాధ్యత వహించాలన్నారు. ఆస్పత్రిలో మందులు అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత డాక్టర్లదే అన్నారు. అవసరమైతే ఆస్పత్రి అభివృద్ధి నిధులను ఉపయోగించి అవసరమైన మందులు కొనుగోలు చేయాలని ఆదేశించారు. జడ్డంగి పీహెచ్‌సీను కూడా ఆకస్మికంగా తనిఖీ చేసి రోగులకు అందుతున్న సేవలను తెలుసుకొన్నారు. ఆయన వెంట వైద్యులు సేవా సుజి, యామినిప్రియ, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్, సిబ్బంది ఉన్నారు.

త్వరలోనే తెలుగు భాషపై ప్రత్యేక వెబ్‌సైట్

- ఉత్తరాంధ్ర సాహిత్య సదస్సును పండగలా నిర్వహిద్దాం
- ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు


విజయబాబును సత్కరిస్తున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: ప్రపంచీకరణ, అభివృద్ధి చెందుతున్న తరుణంలో తెలుగు భాష గురించి ప్రపంచానికి చాటిచెప్పేందుకు త్వరలో తెలుగు భాషపై వెబ్‌సైట్‌ని ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ అధికార భాషా సంఘం, తెలుగు భాషా అభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షుడు విజయబాబు అన్నారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో తెలుగు భాషా అమలు తీరుపై కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ జిల్లాలో భాషావేత్తలు, కవులు, కళాకారులు, సాహిత్యవేత్తలు, తెలుగు భాషా అభివృద్ధికి కృషి చేసినవారందరికి సత్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగుల్లోనూ ఎంతో మంది కవులు, సాహితీవేత్తలున్నారనీ వారిని కూడా గౌరవించాల్సిన ఆవశ్యకత ఉందని సూచించారు. అదే విధంగా త్వరలోనే ఉత్తరాంధ్ర సాహిత్య సదస్సును ఒక పండగలా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరపాలని సూచించారు. కార్యాలయంలో ఉన్నతాధికారులు ఆంగ్లంలో పంపిన లేఖలను తెలుగులో పంపాలని కోరుతూ తిప్పి పంపించవచ్చని స్పష్టం చేశారు. కలెక్టర్ డా.మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ బ్రోచర్లు, కరపత్రాలు తెలుగులోనే ముద్రిస్తున్నామనీ, బస్టాప్‌లో సమాచారం కూడా తెలుగులోనే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమీక్ష అనంతరం విజయబాబుని కలెక్టర్ డా.మల్లికార్జున సత్కరించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.